

# తెరచాటు

నా పేరు సౌదామిని. దానికి తగినట్లుగా నా జీవితక్రమం మొదటినుంచి మెరుపువలె ఆకస్మికంగా గడచిపోయింది. కాని ఆ క్షణికకాలంమాత్రం, అయా సంఘటన గాని, సన్నివేశము గాని మెఱుపుకాంతివలె గాఢముగా హృదయాన్ని దూసుకొని పోయేది. వెంటరు అంధకారం చీకటేగా! అట్లాగే ఆ క్షణభంగురమయిన సుఖాం తన్న విషాదచ్ఛాయలు అలుముకునేవి.

సాధారణంగా మెరుపు వుంటే కాలం చాల తక్కువ తరువాయి చీకటికాలం చాల ఎక్కువ. అట్లాగే నాజీవితంలో సుఖాలకన్న కష్టాలు ఎక్కువకాలం కాపురం చేశా యని చెప్పకతప్పదు. అంటే నా జీవితం దాదాపు హంసపాదులతో నిండిన వ్యాసం అయిపోయిం దన్నమాట.

నా యథాస్థానమయిన కిటికీ తెరచాటున కూర్చుని, చాలా పర్యాయములు ఆలోచించుకు చూచాను— యిందులో నా దోషము ఏమైనా వున్నదా అని. నాకు అవగత మయినంతవరకు, నాదోషం— ఆ విషయంగురించి ఎక్కువగా ఆశాజనకంగా తలపోయడంవరకే. మిగిలినదంతా ప్రకృతి పురుషునకున్నూ, విధాతకు అంటగట్టక తప్పదు. సరే! ఈ తప్పొప్పుల బాధ్యతల నిర్ణయం వదిలివేయండి. దానికి కర్తలు ఎవరూ కాదని వూరుకోవడం మంచిది.

మా నాన్నగారు మిలిటరీనుంచి క్షేమంగా తిరిగిరావడంవలన సివిలులోకూడా మంచి వుద్యోగం లభించింది. స్థానికంగా ఉన్నతమైన స్థానం ప్రాప్తించింది. ఊరికి మధ్యగా ఒక మంచి బంగళాలాంటి

## శ్రీ కోటంరాజు జనార్దనరావు

డాబాను కొనగలిగారు నాన్నగారు. పాశ్చాత్యానుకరణప్రకారం యిల్లంతా తెరలతోను, లైట్లతోను అలంకరించబడింది. ఇల్లు విశాలమయింది అవడంవలను, నాకు యుక్తవయస్సు వచ్చేసరికి తల్లి గతించడంవలనను, జ్యేష్ఠపుత్రికనయిన నాకు ఒక గది ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడ్డది.

అలంకరణలో పాశ్చాత్యానుకరణ వంటబట్టింది, గాని, మా నాన్నగారికి హిందూ సాంప్రదాయాలను దాటి నడవడంమాత్రం చేతకాలేదు. అంటే మనస్థైర్యం లేకకాదు. ఇష్టంలేక. దానితో S.S.L.C. వరకు గరల్స్‌స్కూలులో చదివినప్పటికీ నేను హిందూసాంప్రదాయాలప్రకారం యువతలకు వచ్చి, స్వేచ్ఛగా పురుషులతో తిరిగే అవకాశం కలుగలేదు. నాతోపాటు మిగిలిన యిద్దరు చెల్లెళ్ళుకూడా అసాంప్రదాయాలనే పాటించవలసివచ్చింది. కాని వారి వయస్సు చిన్నది అవడంవలన, నా కున్న అజమాయిషీ, వారికి అవసరం లేకపోయింది.

నేను యిప్పుడు అష్టావశిని. కాలాంతరం వలన నాకు యింకా వివాహం కాలేదు. అందుకు మానాన్నగారి అశ్రద్ధ కొంతవరకు కారణం. కాని ఒకటి రెండు సంవత్సరాల నుంచి మానాన్నగారు తీవ్రంగా నావివాహ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇంతకాలం ప్రయత్నించినా నాకు వివాహం కాకపోవడానికి కారణం, నేను అందవిహీన ననుకుంటారేమో! కాదు నాకు చెప్పుకోతగిన అందచందాలే వున్నాయి. నన్ను అందగత్తెలలో జమకట్టుకోవచ్చును. అయినా ఈ రోజులలో వివాహానికి ప్రాముఖ్యత కేవలం అందం కాదని అందరికీ విదితమే ననుకుంటా! దానికి ప్రత్యక్షఉదాహరణ నే నొకదానిని.

నాబంధువులందరూ, నా తల్లి బ్రతికివుంటే యింకా చిన్న వయస్సులో ముందర వివాహం అయిపోయివుండేది అంటూ వుండేవారు. అది ఎంతవరకు వాస్తవమో నాకు తెలియదు. ఎందుకంటే, మా నాన్నగారికి తన కెంత తోస్తే అంతేనే గాని యితరులమాట తనకు నచ్చకపోతే వినేవినడు. జ్యేష్ఠపుత్రిక నవడంవలననో ఏమో, కొంత నాకోరికలను తనకు యిష్టం లేకపోయినా పాటిస్తూ వుండేవారు. నన్ను యింటర్ చదివిస్తా నన్నారు. ఇప్పటికే చక్రవర్తుల, రాజుల, పుట్టినదినాలు, లెక్కలు నల్లవేసి నా లేతబుర్ర అలిసిపోయింది. అందుకని నేను దానికి యింకా శ్రమ నివ్వడానికి అంగీకరించలేదు. అంతటితో నావిద్యార్థినిదశ అంతమయిపోయింది.

బయటప్రపంచంలో, ఈ వరుడి నాటక దినాలలో మానాన్నగారు, నావివాహానికి ప్రయత్నాలు తీవ్రంగా సాగిస్తున్నారని యింతకు పూర్వం చెప్పాను. నేను మానసిక ప్రపంచంలో ఆరోగ్యాను కొనసాగించుకునేందుకు తెలియకుండా ప్రయత్నం చేశాను.

గృహకృత్యాలను సాకుకు చేందుకు తగిన హంగు వుండడంవలన నా స్నానభోజనాదికసమయాలలో తప్ప మరి యితర సమ

యాలలో, నాగది దాటి వెళ్ళవలసిన అవసరం లేదు. అంటే దాదాపు రోజుమొత్తంలో ఒరవై రెండుగంటలదాక నాగదిలోనే కాలక్షేపం చేస్తూండేదాన్ని — మీకు ఆశ్చర్యం వేయవచ్చును —. ఈస్వకీయ బంధి కాన ఏవిధంగా నాకు మధురం అయిందా అని —. ఏమో దానికి జవాబియ్యలేను. కాని నాకు ఆప్తులల్లా, తెల్లగా సున్నంతో చిరునవ్వులను వెదజల్లుతున్న గోడలు, దాని మీది పటాలు. కాకపోతే నా బంధుగులు అని చెప్పటానికి తెరచాటునుండి కిటికీఅవతల కనపడే బాటసారులు అని చెప్పడానికి కొస్త సాహసిస్తున్నాను.

చక్కగా శృంగారించుకొని, కిటకీ యివతలగదిలో, ఏ నవలో పుచ్చుకొని, తెరచాటుగుండా ప్రపంచాన్ని చూడడానికి ప్రయత్నిస్తూండేదాన్ని. ఏ ప్రేక్షకుణ్ణీ ప్రపంచం యింతవరకు కాదని తిరస్కరించలేదు. ఈ మౌనప్రేక్షకురాలిని ఒయటి ప్రపంచం ఏవిధంగానూ ఆక్షేపించలేదు. పైగా ఆదరించింది. దానికి చిహ్నంగా చాలమంది, ఈవిలోకనాన్ని అర్థంచేసుకున్నవారు ఆకిటికి, వున్న తెరచాటుగుండా కనపడే నన్ను మౌనంగా పలుకరించి, హెచ్చరించి వెడలిపోయేవారు. ఈ మౌన సంభాషణలు, నాకు చాల ఆనందాన్ని యిచ్చేవి. అవే నాకు కాలక్షేపం. ఈ విధంగా రోజులు, నెలలు గడచిపోతున్నాయి.

కాని అనుక్షణము ప్రపంచపుపోకడలను విలోకించేవారికి, ఒక తెలియని శక్తి వస్తుంది. ప్రాపంచికగమనంలో ఏచిన్న అభ్యుదయాన్నైనా తొందరగా గమనించగారు. దానితోపాటు నాలోకూడ కొంత మార్పు వస్తోందని గ్రహించుకోగలిగాను.

'సఖ్యం సాప్తదీనం' అన్నారు పెద్దలు. అంటే ఏడు అడుగులు యిద్దరు కలసి వేస్తే స్నేహం కలుస్తుందని పెద్దల అభిప్రాయం. నాజీవితంలో దానికి ఒక తోక లభించింది మనం వారితో కలసి ఏడు అడుగులు వేయకపోయినా, మనం చూస్తుండగా వారు రెండుసారులు ఈసాప్తపదీనాన్ని పూర్తి చేస్తే, వారు మనకు పరిచితులు అవుతారని, నాకు ఈ తెరచాటు అనభవంతో విదితమయింది.

ఇప్పుడు ఆరోడ్డుమీద నడచేవారిలో దాదాపు చాలమంది ముఖాలు నాకు పరిచితమయ్యాయి. అందులో నా వునికిని గ్రహించినవారు అరుదు! వారు నాకు దగ్గరివారని నేను వేరే చెప్ప నక్కరలేదనుకొంటాను.

సాధారణంగా వున్న అంతమంది స్నేహితులలో ఏ ఒకరో, యిద్దరో ఆత్మీయులవుతారు. అట్లాగే ఈలాచూచేవారిలో ఒక యువకుడు నాకు తెలియకుండా ఆత్మీయుడయినాడు. ఒకనాడు, నేను అప్పుడే శృంగారించుకొని, బయటి ప్రపంచాన్ని చూచేందుకు, అనకూలంగా వుండేందుకు తెరను తీసి సర్దుతుండగా, ఈ యువకుడు తారసిల్లాడు. తెరసద్దడంలో నా గాజులు ధ్వనిచేయడం విన్నాడు. గాజులధ్వని ఏ యువకుని ఆకర్షించదు? వెంటనే అతడు నిలబడి కిటికీవంక చూచాడు. అట్లా ధైర్యముగా నిలబడి చూచే అతనిని నేను చూడక తప్పలేదు. అట్లా తెలియకుండా ఒక నిముషం గడచివుంటుంది. అప్పుడు నాలో అవ్యక్తమధురమయిన సిగ్గు ప్రవేశించింది. వెంటనే తెరను నామీదకు లాక్కున్నాను. ఒక నిముషంతరువాత తెరచాటుగుండా తొంగిచూచాను. అతను అప్పుడే నిస్పృహతో కదలివెడుతున్నాడు.

ఆ విధంగా అతనితో నాకు పరిచయభాగ్యం లభించింది. అప్పటినుంచి అదే వేళకు తయారయి, ఆ తెరదగ్గర కూర్చుని చాటుగుండా అతనిరాకకు ఎగరుచూస్తూ వుండేదాన్ని. రోజు కొక పర్యాయమైనా అదేసమయానికి నాలుగుకళ్లూ కలుసుకొని, పలుకరించుకునేవి. ఆ పలుకరింత భావమేమో అది కోరే స్వార్థమేమిటో పోనుపోనుగాని అర్థం కాలేదు.

సూర్యోదయ సూర్యాస్తమయాలే ప్రతిరోజూ ఒకే సమయానికి జరుగవు. అటువంటప్పుడు ప్రకృతి యథేచ్ఛకు పాత్రులమయిన మానవులుమాత్రం ఆ నియమాన్ని ఎట్లా పాటించగలరు. ఆవిధంగానే మా కలయిక, మౌనసంభాషణలు జరిగే కాలనిర్ణయంకూడ మారుతూవుండేది. దాంతో నాకు ఒకచిక్కు వచ్చింది. ప్రతిదినము ఆ పలుకరింతకు నేను అలవాటుపడ్డాను. ఆ కలయిక లేనిదే తోచదు. అందుకని ఆరోజుల్లో ప్రతిదినము నేను అతనికోసం ఎదురుచూస్తూ కూర్చోవలసివచ్చేది; కూర్చునేదాన్ని.

కాని అతను నా ఈ సమస్యను గుర్తించాడో ఏమో తెలియదుగాని, మిగతాసమయాలలో అతనికొరకు నిరీక్షించకుండా, తాను వచ్చేసమయం తెలియకుండానే కొన్ని సూచనలు అందచేసేవాడు. అతని బూటుధ్వని నాకు కంఠస్థమే. బిగ్గరగా నవ్వుతూ, స్వేచ్ఛగా మాట్లాడే అతని కంఠధ్వని నాకు పరిచితమే. దూరంగా వుండగానే, మహారాజు తరలివచ్చేటప్పటి బహుపరాకులులాగ, ఆబూటుటకటకధ్వని, అతని కంఠధ్వని. అతని రాకను తెలియపరచేవి. తొందరగా నా శృంగారాన్ని సరిదిద్దుకొని జారగంటితో తొంగి చూచేదాన్ని. అతను చూచి వెళ్లిపోయేవాడు.

ఆ క్షణకాలంకొరకు నేను ఎగురు చూస్తూ కూర్చోవలసివచ్చేది. ఒక్కొక్కనాడు రోజంతా నిరీక్షించవలసివచ్చేది. సూర్యాస్తమయం అయింతరవాత యిబ్బంది లేకుండా, మునిసిపాలిటీవారి ఎలక్ట్రిక్ స్తంభము మా కిటికీకి ఎదురుగా వున్నది. కాబట్టి ఏఅవస్థా లేకుండా ఈ కలయిక జరుగుతూ వుండడానికి అవకాశం లభించింది. పోను పోను యిదే నాకు చదువూ, కాలక్షేపమూ అయిపోయింది. ఈ అవ్యక్తమూకసంభాషణలే నాకు పరిపూర్ణపరిజ్ఞానాన్నీ, తెలియని నూతనఅనుభూతులనూ అందిస్తూండేది. మౌనంగా వాటిని స్వీకరిస్తూండేదాన్ని.

కాలం గడుచుకువస్తోంది. ఆ అపరిచిత వ్యక్తి నాకు మౌనంగా పరిచయం అయిపోయాడు. నాకు వ్యక్తిగతంగా యింకా పరిచయం కాలేదు. చేసుకోవాలనిపించింది. కాని అది అసంభవమని, దానికి అడ్డుగా సంఘం నిలబడుతుందని తెలియచేస్తూ, కిటికీవూచలు మాయిద్దరికే మధ్యగా నిలబడ్డాయి. హృదయభావాలను తెర తొలగించినట్లుగా బయటకు వ్యక్తపరచుకో వచ్చును గాని, అబలను, ఆ యినుపవూచలను ఎట్లా భేదించగలను? నాలో నిస్పృహ బయలుదేరింది.

కాని ఒకనాడు 'అనుకోని సంఘటన జరిగింది. కాలం అనుకూలిస్తే అన్నీ మనకు అనుపానంలో నడుస్తాయి కదా అనుకున్నాను. బయట బ్యాండు - ధ్వనితో ఏదో *Advertisment* బండి వెడుతోంది. నేను లోపల సోఫాలో కూర్చుని నవల చదువుకుంటున్నాను. నెమ్మదిగా లేచి వెళ్ళేసరికి బండి కిటికీ దాటిపోయింది. చాల దినాలయింది, సినిమా చూచి. కనీసం సినిమా మారిందని తెలుస్తే నాన్నగారిని బలవంతం చేసి వెళ్ళవచ్చుననుకున్నాను. సినిమా-అంటే జ్ఞాపకానికి వచ్చింది - ఈతనిని సినిమాలలో బిగ్గరగా మాట్లాడుతూ, స్వేచ్ఛగా నవ్వుతూండగా, ఒకటిరెండుసార్లు చూచినట్లు

జ్ఞాకం. మౌనంగా అట్లాగే కిటికీదగ్గర, అనంతశూన్యంలోకి చూస్తూ నిలబడి పోయాను.

"అక్కయ్యా, ఈవాళ నాటకంటే వెడదాము" అంటూ నాచెల్లెలు ఒక *Pamphlet* తెచ్చింది.

చూచాను. అది నాటకపు *Advertisement*. ఆ పేపరును నన్ను ఆకర్షించింది. లోపల ఈతనిబొమ్మ బ్లాకు వేసివుంది. క్రింద అతని పేరు ప్రస్ఫుటంగా ముద్రింపబడివుంది. పేరు జగన్నాథ్ అయితే ఈతను ఒక నటకుడన్నమాట. గరల్స్‌స్కూలులో చదువుతూంటేగా, నాటకాలలో కొన్ని బహుమతులు పొందివుండడంవలన, నాకు నాటకాలంటే అభిమానం. నటకులంటే గౌరవం. అందులో పరిచితులు నాటకం వేస్తున్నారంటే మన అభిమానం వర్ణించలేము. తప్పక వెళ్ళా లనిపించింది. తృణికంగా చూచి తృప్తిపడే అతనిని ప్రత్యక్షంగా, వివిధ హావభావవిలాసాలలో చూడవచ్చును. చెల్లెల్ని వొప్పించి, నాటకానికి వెళ్ళేందుకు దానిచేత బలవంతపెట్టించాను. నాన్నగారికి వొప్పుకోక తప్పలేదు. ఆనాడు నాటకానికి వెళ్ళాము. అందరిలోను ఈతని వేషమే నాకు బాగా నచ్చింది. మరునాడు పత్రికలలోకూడ ఈతనిబొమ్మ ప్రచురితమయ్యి ఈతని నటనాకౌశల్యాన్ని శ్లాఘించారు. దాంతో ఈతనిమీద నాగౌరవం ద్విగుణీకృతం అయింది.

నాటకం అయింతరువాత ఈతనిని మరల చూడాలన్న కోరిక కలిగింది. వీలుగా వుంటే అభినందనలు అందచేద్దా మనిపించింది. అవకాశంకోసం ఎదురుచూస్తున్నాను. ఒకనాడు దీపాలు పెట్టినతరువాత ఈతను యిద్దరు బాగా అలంకరించుకున్న మహిళలతో, కేరింతాలాడుతూ, నవ్వుకుంటూ రోడ్డుమీదుగా వెడుతున్నాడు. అలవాటుప్రకారం కిటికీవంక చూచి వెళ్లిపోయాడు.

నాలో ఈర్ష్య ప్రారంభమయింది, అన్యాక్రాంతుడైపోతున్నాడని. వారం రోజులు ఆవేశంతో, కోపంతో అతనిని మరచిపోదామని తెర మూసి వేసి తిరిగాను. అతను వచ్చే ముందు మామూలుగా వినపడే బహుపరాకులను ఆలకించినప్పటికీ తెర తీయలేదు. కాని నెమ్మదిగా ఆవేశం చల్లబడింది. దానికి కారణం నాగదిలో రాసక్రీడలలో వున్న కృష్ణుని చిత్రం వుంది. అది నాకు సమాధానం యిచ్చింది. అయితే జగన్నాథ్ కూడ శృంగారపురుషు డన్నమాట. స్త్రీకి కావలసింది శృంగారపురుషుడేగా. మరల తెరను తెరిచాను.

* * *

మా నాన్నగారు నాకు కాలక్షేపన కావడం లేదని ఆ మధ్య కొన్ని పత్రికలకు మ్యాగజైనులకు చందాలు కట్టారు. యథావిధిగా అవి వస్తున్నాయి. మా నాన్నగారి భ్రమే కాని, కన్యకు కాలక్షేపన కాక పోవడమేమిటి? చపలచిత్తులకు కాలక్షేపన కాకపోవడం అంటూ వుండదు. వారికి అసలు వూపిరే ఆడదు. రోజుకు ఇరవై నాలుగుగంటలు చాలవు. అందుకనే నాకు ఈ పత్రికలను చూచే అవకాశం వుండేది కాదు.

ఈ తెరమూసిన వారంరోజులలో నిమ్మది నిమ్మదిగా పత్రికలు తిరుగవేయడం ప్రారంభించాను. ఆనాడు ఆదివారం. ఆంధ్రపత్రిక తీశాను. కథాసాహిత్యంవైపు పుటలను దృక్కులను సారించాను. మళ్లీ ఈతను ప్రత్యక్షము కూడు. పేజీనింపుతూ జగన్నాథ్ కథ వ్రాశాడు. "నేను" అంటూ అంటే తనజీవితంలోని అనుభూతిని వ్రాసుకున్నా డన్నమాట.

ఇంతకుపూర్వం అతనిపై ప్రబలియున్న ద్వేషంతో ఆ పత్రిక అవతల పారవేసి, కాలుగాలిన పిల్లిలాగ తిరిగాను యింట్లో. నాకు అశాంతిగా వున్నప్పుడు నాన్నగారి దగ్గరకు వెళ్లికూర్చోవడం అలవాటు. మా నాన్నగారు పడకకుర్చీలో కూర్చుని, ఏదో ఆలోచించుకుంటున్నారు. నేను రావడంతోనే "రా అమ్మా కూర్చో" అన్నారు. కుర్చీ దగ్గరకు లాక్కొని కూర్చున్నాను. వారికి తెలుసును నా మనస్సు బాగుండకపోతేనే గాని అక్కడకు రానని.

"అమ్మా, విశేషాలు ఏమిటి?" అన్నారు.

ఊరకే కుక్కనవ్వు నవ్వి "ఏంలేవు నాన్నా" అన్నాను. ఒకసారి వారు నావంక చూచి, ఒక్కక్షణం ఆగారు.

"పేపరుచూచావా, అమ్మా అన్నారు.

"లే" దన్నాను.

చెల్లాయిని పిలిచి పేపరు తెప్పించి, తిరగవేసి ఒక కాగితం యిస్తూ—

"చూడమ్మా. ఈకథ చదువు. విందాం. కాలక్షేపన అయిపోతుంది" అన్నారు.

చదవక తప్పలేదు. మా నాన్నగారిమాటను కాదనలేనాయె మరి! కాలంలోని మార్పులను సూచిస్తూ, తన అనుభవంలోని సంఘటనలను, వంశక్రమానుగతంగా చిత్రించాడు. చాల బాగుంది. మా నాన్నగారు బాగుం దని మెచ్చుకున్నారుకూడాను. దాంతో అతనిపైని కోపం, మేఘంలాగ చెప్పపెట్టకుండా విడిపోయింది. అంటే జగన్నాథ్ రచయిత కూడా నన్నమాట.

అగస్మాత్తుగా నాకు, రచయిత, నటకుడు అయిన వ్యక్తిని వివాహంచేసుకుంటే బాగుంటుం దనిపించింది. నాఅభిలాషకు సమాధానంగా, అందుబాటులో నిలబడ్డ వ్యక్తిని తలుచుకుని, సిగ్గుపడి, నాగదిలోకి వెళ్లి సోఫాలో కూలబడ్డాను. నాలో ప్రేమాంకురం తెలియకుండా ప్రారంభించిం దని, ఆనాడు తెలుసుకోలేకపోయాను.

\+ \+ ×

నాలో ఈమానసికపరివర్తన జరుగుతున్న సమయంలో, మా నాన్నగారు నాకు వివాహప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాలు ఒకదరి చేరేవరకు, నాదగ్గరకు ఆ విషయం రాలేదు. తెలిసినతరువాత తప్పుకునే అవకాశం గాని, ఆశగాని లభించలేదు. ఈ సమయంలో నాతల్లి లేకుండా చేసిన విధాతను నాలో నేను దూషించుకున్నాను. ఎందుకంటె, తండ్రి,- సంతానం మధ్యతల్లి *'Broad Casting Station'* లాంటిది. ఒకరి మనస్సులోని భావాలు యితరులకు ఆపెద్వారా అందచేయబడుతాయి. ఈసమయంలో మా అమ్మగారు జీవించివున్నట్లయితే మా నాన్నగారి ఈ పెళ్లిప్రయత్నాలు నాకు ఆదిలోనే తెలిసేవి. నాఅభిలాషనుకూడ, కనీసం చూచాయగానైనా, అందచేసేదాన్ని. ఇప్పుడు లేనిదానికి విచారించి ఏంలాభం అని నిట్టూర్చి వూరకున్నాను.

అనకోకుండా జగన్నాథ్ వ్రాసిన కథలోని వాక్యాలు జ్ఞప్తికివచ్చాయి.— "నిస్పృహచెంది ఆగిపోవడం భారతజాతిసాంప్రదాయం కాదని". అవు ననిపించింది. చారిత్రాత్మకసంఘటనలు జ్ఞప్తికి వచ్చాయి. వెంటనే భవిష్యత్తునుగురించి తలపోయడం మంచిదనిపించింది బాగా ఆలోచించిచూచాను. దానికి ఒక్కటే మార్గం కనపడింది. రుక్మిణీసతి, కృష్ణునితో కలసి వెళ్లిపోయినట్లు, చల్లగా ఈయువకునితో వెళ్లిపోదామన్నంతవరకు వచ్చింది వూహ. కాని ధైర్యం చాలలేదు. కనీసం ఈఅభిలాషను అతనికి అందించలేకపోయాను. దానికి నిజా

(33-వ పేజీ చూడుడు)

# తెరచాటు

(14-వ పేజీ తరువాయి)

నికి నేను దోషిని కాను. ఎందుకంటె అవకాశంకోరకు ఎదురుచూస్తూండగానే, పెళ్లివారు వస్తున్నారన్న ఖబురు నన్ను చేరింది.

నిస్పృహతో, నిరాశతో క్రుంగిపోయాను. కాని నిబ్బరంగా ఆలోచించుకునే స్వభావం మానాన్నగారిదగ్గరనుంచి మాకందరికీ అలవాటయింది. నాచిన్న చదువును, అందులోని సారాంశాన్ని దానికి వినియోగించాను. అప్పుడు నాకు సమాధానం దొరికి, నన్ను సమాధానపరచింది. అవును! ఎంతమంది భారతీయకన్యలు, తాము కోరినవారిని విడిచి, కులమతగౌరవాలకై యితరులను చేపట్టలేదు? నేనూ అటువంటి భారతనారినే. వారి సాంప్రదాయాలను గౌరవించి, పెద్దల అడుగుజాడలలో నడవవలసిందే!.

మామేనత్తసహకారంతో పెండ్లిచూపులకు తయారయ్యాను. నియమితసమయానికి పెళ్లివారు వచ్చారు. నన్ను సావడిలోకి రమ్మని నాన్నగారు ఖబురుపంపారు — ఆశతో తెరచాటుగుండా ఒకసారి అవతలకు చూచాను—కనీసం ఈఆఖరిక్షణంలోనైనా జగన్నాథ్ వచ్చి సాయపడుతాడని, ఎక్కడో నాహృదయకుహరంలోనుంచి కేక వినపడుతోంది. నిర్జీవమైన రోడ్డును చూచేసరికి ఆకేకసవ్వడికూడ అంతర్ధానమయిపోయింది.

నిమ్మదిగా తల వంచుకొని సావడిలోకి వెళ్లి కూర్చున్నాను. పావుగంటదాక పెద్దలందరూ గుక్క తిప్పుకోకుండా, ఆ పెళ్ళికుమారు నాకూ, నన్ను పెళ్ళికుమారునకూ పరిచయంచేస్తున్నారు. మౌనంగా, తల వంచుకుని వింటున్నాను.—నా చెవులు వినడానికి తిరస్కరించినా, ఆపరిచయంలో ఎక్కడో నాలో ఆశ తిరిగి రేకెత్తింది నిమ్మదిగా పెద్దలు మాటలు చాలించినతరువాత, తల ఎత్తి చూచాను—అతడు జగన్నాథ్!!

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అప్రయత్నంగా నాకంటివెంబడి నీరు ప్రవహించింది. ఇది చూచి అందరూ తెల్లబోయారు. మా నాన్నగారు ఖంగారుపడి "ఏదేమిటమ్మా" అన్నారు.

నేను సిగ్గుతో వెంటనే కళ్లు తుడుచుకునేందుకు ప్రయత్నించాను.

వారిలో ఒక పెద్దమనిషి "ఆఅమ్మాయిని లోపలకు పంపించండి" అన్నారు.

నాలో ఆనందం ఉబ్బెత్తుగా పొంగింది. వెళ్ళి నా గదిలోని సోఫాలో చతికిలబడి, ఒక్క నిముషం విశ్రాంతిగా ఏడ్చాను ఆనందంతో. పావుగంటఅనంతరం బయట గుఱ్ఱపుబండి చప్పుడయితే, తెరదగ్గరకు చేరి చాటుగుండా తొంగిచూచాను. పెళ్ళివారు వెడుతున్నారు. చివర కూర్చున్న జగన్నాథ్ అలవాటుప్రకారం కిటికీవంక చూచాడు. సిగ్గుతో ప్రక్కకు తప్పుకున్నాను. బండి వెళ్ళిపోయింది.

\+ \+ \+

తలవనితలంపుగా నా ఆశయాలను పరిపూర్తి చేయబోతున్న ఆ విధాతకు ఏవిధంగా నా కృతజ్ఞత తెలియచేయాలో అర్థంకాలేదు. ఇప్పుడు నేను ఒక కవికి, నటకునకు సపత్నిని కాబోతున్నానన్నమాట! నాలో తెలియని ఆనందం అంతులేకుండా పొంగసాగింది. వెంటనే 'సపత్ని తగినది' అని అనిపించుకోవాలని కోరిక కలిగింది. సాధారణంగా కవుల, నటకుల హావభావవిలాసాలు ఒకేవిధంగా వుంటాయి. అందుకని' నాకు అందినంతవరకు వూహించుకుని, దానికి తగిన వాతావరణం నానుంచి ద్యోతమయ్యేటట్లు, నన్ను నేను సంస్కరించుకోప్రయత్నం సాగించాను. ఒక్కముక్కలో చెప్పాలంటె నేను జగన్నాథ్‌కు ధర్మపత్నిగా భావించుకుని, మానసికంగా అతనితో దాంపత్యాన్ని సాగిస్తూ, ప్రాపంచికలాంఛనమైన వివాహానికి ఎదురుచూస్తున్నాను. మా ఈ భావైక్యతలో, మాకు ఒకవిధంగా, గాంధర్వరీతిని వివాహం అయిందని చెప్పవచ్చును.

కాని నాలో వున్న ఈ తొందరపాటు ఆదుర్దా మా నాన్నగారిలో కనపడడంలేదు. వారిలోకూడ ఈ తొందర ప్రవేశపెడుతే, వివాహం శుభకరంగా సాగిపోతుం దనిపిస్తూ వుండేది. మరి వారిలోకూడ ఆ కోరిక వుద్భవించేటట్లు చేసే దెవరు? మళ్లీ తల్లిలేని కొరత నాకు జ్ఞప్తికి వచ్చింది. మాతృవిహీనమైన సంతానం, ఎంత దురదృష్టవంతమైనదో కదా అనిపించింది.

ఏదోవిధంగా ముందడుగు వేయాలన్న కోరిక కలిగింది చదువుకున్నదాన్ని—నాకు వుపాయాల కేమిటి కొరవా! అందులో కన్యకు వివాహప్రయత్నంలో అంతులేని వింతవూహలు దొరుకుతాయి. నా పెద్దచెల్లెలిని నాన్నగారిదగ్గరకు పంపించాను. నేను చాటుగుండా, గుమ్మందగ్గర సమాధానంకొరకు నిలబడ్డాను.

"నాన్న మరి అక్కయ్యపెళ్ళి ఎప్పుడు? మరిపందిరీ, అవీ వేయించవూ?" అంది.

సావడిలో నాన్నగారు పడకకుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఈ ప్రశ్న విని, పేపరు మడిచి రెండుమూడు నిముషాలు, మౌనంగా వుండిపోయారు. నాలో ఆవేదన ఎక్కువ అయింది. తరువాత "అమ్మా, అక్కయ్య, బావకు నచ్చాలమ్మా. అప్పుడుగాని పందిరి వేయడానికి వీలు లేదమ్మా" అని ఆ చిన్నదానికి అర్థం అయ్యే భాషలో నెమ్మదిగా అన్నారు.

అప్పుడు నాకు తట్టింది—వివాహప్రయత్నాలకు ఈరోజులలో పెద్దవారి అనుమతి అనవసరమూ, అప్రస్తుతమూ అనీ, వధూవరుల అంగీకారమే ప్రధానమని నాకు అతనితో వివాహము అంగీకారమే. కాని అవరునికి—?

నా అనుమానానికి నాకే నవ్వు వచ్చింది. అతను నన్ను కాదంటాడా? లేకపోతే ఆ తెరచాటునుండి నన్ను ఎందుకు తొంగిచూస్తూండేవాడు? వెంటనే అనుమానంతో నాలో తలఎత్తిన ప్రశ్నను ఒక మొట్టికాయ వేసి దాచివేశాను.

రోజులు గడుస్తున్నాయి. వారిదగ్గరనుంచి సమాధానం యింకా రాలేదు. నా చెల్లెలు అన్నట్లు, యింటిముందర పందిరి వేయడం పడలేదు.

\+ \+ \+

అది వేసవికాలము. బాగా పెండ్లిండ్లు జరిగేదినాలవి. ఎటు చూచినా వినవచ్చినా మంగళవాయిద్యాలే. ఒకనాడు ఉదయం రోడ్డుచివర నాయుడుగారింట్లో, నా సహాధ్యాయిని పెండ్లిని తెలియబరుస్తూ నౌబతు ఖానా సన్నగా వినిపిస్తోంది. సోఫాలో కూర్చుని ఆలకిస్తున్నాను.

ఇంతలో నా చెల్లెలు ఒక కవరు తీసుకుని వచ్చి యిచ్చింది. నాన్నగారి పేరన వుంది. మరి నా చేతికి వచ్చిందేమా అని ఆలోచించి చూచాను. కవరు చించివుండడంవలన, మా నాన్నగారు చూచి నా కిచ్చారని అర్థంచేసుకున్నాను. విషయ మేమిటా అని చూచాను.

"మీ సంబంధం చేసుకోలేనందుకు చింతిల్లుతున్నాము" అని పెళ్ళివారు వ్రాశారు.

రోడ్డుచివర నౌబత్ ఖానాధ్వని సన్నగానే వినిపిస్తోంది ఆ వుత్తరాన్ని మళ్లీ మళ్లీ చదివాను.

ఉవ్వెత్తున దుఃఖమూ, కోపమూ పొంగుకొచ్చాయి.

"ఎవరు వ్రాశారక్కా" అంది చెల్లెలు.

అందుబాటులో వున్న చెల్లెల్ని ఒక్క చెంపకాయ వేశాను. ఈ చెడువార్త తెచ్చినందుకు. అది పెద్దపెట్టున ఏడుస్తూ నాన్నగారిదగ్గరకు ఫిర్యాదుకై వెళ్లింది. వెంటనే సిగ్గుపడి నా గదిగుమ్మం బిగించుకుని గుమ్మంప్రక్కన చతికిలబడ్డాను.

దూరాన్న వినపడుతున్న సన్నాయి ధ్వనులతోపాటు, ఈ ఉత్తరంలోని అక్షరాలుకూడ వికృత ధ్వనులతో వినపడుతున్నాయి—మీ సంబంధం చేసుకోలేనందుకు చింతిల్లుతున్నాము'!!

నాలో విరుద్ధ, వింతభావాలు ప్రప్రథమంగా బయలుదేరి, ఆ పెళ్లివారిని తూలనాడాయి. కాని తామసప్రవృత్తి, చిన్నప్పటినుంచి, ఉగ్గుపాలతో రంగరించి, మా నాన్నగారు అలవాటుచేశారు. నాలోని తీవ్రతను నిమ్మదిగా సంబాళించుకోగలిగాను.

ఇక నిమ్మదిగా కారణాలను ఆలోచించుకో ప్రయత్నించసాగాను. ప్రప్రథమంగా, నాన్నగారు చెల్లెలితో అన్న ముక్కలు జ్ఞప్తికి వచ్చాయి. అయితే నాన్నగారు అన్నట్లు నేను ఆ వరునకు నచ్చాలన్నమాట. అయితే నేనాతనికి నచ్చలేదా! నేను అందవిహీనను కానే! వెంటనే, ఎందుకనో, నా అందంపై నాకే శంక కలిగింది. లేచివెళ్లి నిలువుటద్దం ఎదురుగా నిలబడి నా ముఖాన్ని పరీక్షించి చూచుకున్నాను. కన్నీటి చారలతో తడిసిన నా ముఖం మలినమయిపోయి, కళావిహీనమయిపోతుంది. అయితే నేను అందగత్తెను కానేమో నన్న శంక, నాలో తెలియకుండా బలీయం అవసాగింది. అయితే ఈ ప్రపంచంలో అందవిహీనలు వివాహానికి అనర్హులా—?...అధికంగా ఆలోచిస్తే ఎంతమంది అవివాహితులుగా మిగిలిపోతారు?. నా సమాధానం నాకే భయాన్ని కలిగించింది—!

వెంటనే ఉద్రేకం నాలో ప్రారంభించి, తిరిగి నూతనప్రశ్నపరంపరలను రేకెత్తింపచేసింది. జగన్నాథ్—ఏం? అతడుమాత్రం అందగాడా? చెప్పుకోదగ్గ అరవం లేదే? పైగా కవిత్వం అంటూ, నాటకాలంటూ దేశదిమ్మరిలాగ తిరుగుతూ వుంటాడే. పైగా కవుల, నటకుల శీలాలను పవిత్రం అని చెప్పే అవకాశంకూడ లేదే! అటువంటప్పుడు అతనికి నన్ను తిరస్కరించే అధికారం, అహంభావం ఎక్కడిదే?

నాలాంటి కులీనకన్య పెండ్లికూతురుగా లభించిందంటే సంఘంలో మారని కవులు, నటకులు, నన్ను వెంటనే అంగీకరించి, ఆశతో పెండ్లిచేసుకోవాలే? అయితే జగన్నాథ్ ఈ సదవకాశాన్ని జారవిడుచుకున్నాడన్నమాట. సమయానుకూలంగా అవగాహన చేసుకోలేనంత అమాయకుడన్నమాట!—

వెళ్ళిపోతోంది నా మనస్సు లోతుకి యింకా లోతుకి. అతని లోపాలను ఎన్ని వెక్కిరించాలని నా మనస్సు తహతహలాడుతోంది. కాని ఎక్కడనుంచో అందని ద్రాక్షపళ్లు పుల్లగానే వుంటాయన్న సామెత స్ఫురణకు వచ్చింది. వెంటనే సిగ్గుపడ్డాను. నా ఆవేశానికి—

గదితలుపు తట్టారు ఎవరో. వెంటనే, పమిటతో ముఖాన్ని తుడుచుకొని తలుపు తీశాను.—నాన్నగారు వచ్చారు. తలవంచుకుని నిలబడ్డాను. దగ్గరకు వచ్చి నాతల నిమురుతూ—

"అమ్మా! విచారించకమ్మా. జరిగిందల్లా మనమేలుకొరకే జరిగింది. ఆ కథలు వ్రాసుకుంటూ, నాటకాలలో వేషాలువేసేవాడు, నిజానికి నీకు భర్తగా తగడమ్మా! పోనీగాని, రోడ్డుచివరి నాయుడుగారి అమ్మాయి, నీకోసం కారు పంపింది. వెళ్ళిరా అమ్మా" అన్నారు.

"నేను వెళ్లలేను నాన్నా" అన్నాను బొంగురుపోయిన గొంతుకతో.

"కాదమ్మా, మళ్లీ మనం ప్రపంచంలో తిరుగవలసినవాళ్లము. చిన్న ఎదురుదెబ్బ తగిలిందని, గమనాన్ని ఆపుతామా? ముందుకు వెళ్ళవలసిందే. లేచి ముఖం కడుక్కొని వెళ్లిరా, ఆనక నేను వస్తాను"అని సావడిలోకి వెళ్ళిపోయారు.

నాన్నగారి వాక్యాల సారాంశాన్ని అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తూ అలాగే కూర్చుండిపోయాను. నిరాశచెందినా ప్రపంచంలో మనం గమనం ఆపకూడదు. నాకు నవ్వు వచ్చింది. ఆ గమనాన్ని వాస్తవికజీవితంలో ఎంతవరకు సాగించగలమా అని ఆలోచించడం ప్రారంభించాను. ప్రశ్నకు సమాధానం దొరకడం




1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరకును.

శ్రీ అంబాళ్ అండు కంపెని,

తపాలు పెట్టె నెం. 3, మదరాసు.

లేదు. ఎంతసేపు కూర్చున్నానో తెలీయదు గాని, బయట కారుహారనుమోతతో వులిక్కిపడి, వెంటనే క్లుప్తంగా సింగారించుకుని, రోడ్డుచివరి నాయుడుగారింటికి వెళ్ళాను.

నెమ్మదిగా పెండ్లిపందిరి ప్రవేశించాను. పెండ్లి జోరుగా, హడావుడిగా సాగిపోతోంది. నాలో ఈర్ష్య తిరిగి ప్రారంభం కాపోయింది. కాని మనస్సును చిక్కబట్టుకోగలిగాను. పెండ్లిమంటపాన్ని ప్రవేశించాను—

తెరచాటున వధూవరులు, ఒకరినొకరు చూచుకునేందుకు తహ తహ లాడుతూ కూర్చునివున్నారు. నన్ను ఆ కుటుంబంలోనివారు బాగా ఎరుగివుండడంవలన, పెండ్లికూతురి సహోద్యాయిని అవడంవలన గౌరవించి కూర్చోబెట్టారు.

ఆ సందడిలో కూర్చున్నా నన్నమాటేగాని, నా మానసికతలంపులు విహారంచేయడం ప్రారంభించాయి.

తెరచాటు - ప్రథమంగా ఈ తెరను తొలగించినప్పుడు వధూవరులు ఒకరినొకరు చూచుకుంటారు. అవ్యక్తమయిన భావపరంపర వారిలో ప్రవేశించి, జీవితాంతం వరకూ, వారివారి మనసులలో శాశ్వతంగా వుండిపోతుంది. సంసారం శాంతంగానూ, సారవంతంగానూ జరిగిపోతుంది. అందుకనే ఈ తెరచాటును మన పురాతనసాంప్రదాయాలు పాటించాయి. వాటి ప్రాముఖ్యతను మనం గ్రహించుకోలేక నవ్యభావాలంటూ, అభ్యుదయాంఅంటూ, ఈ పెండ్లి నిశ్చయింపులను, వధూవరుల చిత్తప్రవృత్తులపై పెట్టి సాగిస్తున్నారు.

దీనిని అవకాశంగా తీసుకొని, యుక్త వయస్సుకు వచ్చి వ్యక్తి అయిన యువకుడు, అతని చిత్తవృత్తిని బట్టి సమాధానంయిస్తాడు. ఆ సమాధానాన్ని బట్టి పెండ్లి జరగడంగాని ఆగిపోవడంగాని జరుగుతుంది. అంతవరకు ఈ కన్య, అతని జవాబును ఎదురుచూస్తూ, అమాయికహృదయంతో, హృదయసామ్రాజ్యంలో అతనితో దాంపత్యాన్ని కొనసాగిస్తుంది. కాలకర్మ వశాత్తు చివరకు అతను తిరస్కరిస్తాడు. ఆమె ఊహాలన్నీ గాలిలో మేడలయిపోతాయి. చివరకు ఆమె యింతవరకు మానసికవ్యభిచారాన్ని కొనసాగించిన దవుతోంది. ఆమెకన్యాత్వమే భంగమయిపోతోంది.

అయ్యో! ఈ పెండ్లిచూపులవలన భారతీయమహిళల శీలమే కళంకమయిపోతోందే, అని తీవ్రవేదన కలిగింది నాలో. ఈ అభ్యుదయభావాలనుకునే నూతనసంఘసంస్కర్తలపై నాకు తీవ్రమైన ఏహ్యభావం కలిగింది. మన వ్యక్తతనే నాశనము చేస్తున్న ఈ అభ్యుదయ, నవీనపోకడలు మన కెందు కనిపించింది. అందుకనే భారతదేశం తిరిగి ఋషిసాంప్రదాయాలను చక్కగా అవగాహనచేసుకొని, వాటిని పాటిస్తే బాగుండు ననిపించింది. వధూవరులను తెరచాటున నుంచి, పెద్దవాండ్రు బాధ్యతాయుతంగా వివాహాన్ని కొనసాగిస్తే, కన్యకు ఈ మానసికవ్యభిచార ముండదు., ఆమెశీలము నిష్కళంకముగానే నిలబడుతుంది. అన్ని కాలాలకు సరిపోయిన సంస్కరణలను అందచేసిన ఆ మహాఋషులకు నా నమోవాకములను అందజేయకుండా వుండలేకపోయాను—

ఇంతలో నన్ను ఎవరో తట్టి పలకరించారు. తేరుకొని చూచాను. నా సహాధ్యాయిని, పెండ్లికూతురు, తృప్తితో కూడిన హాసంతో నన్ను పలుకరిస్తోంది.

"ధన్యురాలవు చెల్లీ, భగవంతుడు నిన్ను సదా రక్షించుగాక!" అని మనస్సులో ఆమెను దీవించాను. వేడుకలయింతరువాత, కారులో నెమ్మదిగా యింటికి చేరి, నా గదిలో సోఫాలో కూలబడ్డాను.

మళ్లీ పాతవాతావరణంలోకి వచ్చి కూర్చున్నాను. ఆగది - కిటికీ తెర - గతచరిత్రనంతా జ్ఞప్తికితెచ్చి నేను కన్యనను సంగతి తిరిగి స్ఫురింపచేశాయి. అయితే "తాత్కాలికంగా మెరపుతీగవలె వచ్చిన, భావపరంపరలకు గురిఅయి గాయపడిన, సౌదామిని నేను అని అనుకుని కూర్చుండిపోయాను.

అయితే నేను వివాహానికి ఎదురుచూస్తున్న ఒక భారతీయకన్యను అనకుని, బిగువుగా నిట్టూర్చాను. ఈ సంఘటన జరిగింతరువాత కాలచక్రం చాల దొర్లింది. కాని నాలో మార్పు యింకా ఏమీ రాలేదు. ఇంకా ఆగదిలో బందీగానే వుండి, కన్యాజీవితాన్ని గడుపుతున్నాను!

సౌదామిని, తన కోరికలు సఫలీకృతమయి, గృహిణి కావాలన్న కోరికతో ఎదురుచూస్తూనేవుంది. ఆ తెరచాటున!

---

సర్వోత్కృష్టమైన
"కానన్ దేవన్"
టీ మాత్రమే త్రాగండి.
Kanan Devan Tea
KANAN DEVAN TEA
Quality Production
చీఫ్ ఏజంటు: కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరు జిల్లాలకు
కె. ఎ. జోషి, అనంతపురం.
టోకు వ్యాపారస్తులకు విశేష సౌలభ్యము
వివరములకు నేడే వ్రాయండి.